క్లుప్తంగా

నేడు మంత్రి రోజా అవనిగడ్డ రాక

అవనిగడ్డ: రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖా మంత్రి ఆర్‌కే రోజా అవనిగడ్డలో నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ఏఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఉదయం జరుగనున్న సున్నా వడ్డీ కార్యక్రమాన్ని మంత్రి రోజా ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం జరిగే నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొంటారని వివరించారు.

128 మందికి గుండె వైద్య పరీక్షలు



టి.కొత్తపాలెం(నాగాయలంక): టి.కొత్తపాలెం శివారు డేగలవారిపాలెం రామాలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహక ప్రతినిధి వేములమడ హరిప్రసాద్ తెలిపారు. ప్రవీణ్ కార్డియాక్ సెంటర్ (విజయవాడ) ఆధ్వర్యంలో గుండె వైద్య నిపుణుడు డాక్టర్ విశ్వనాథ్ గుండె, మెదడు వ్యాధులకు సంబంధించి 128 మంది రోగులకు ఈసీజీ, టూ డీఎకో స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేశారని చెప్పారు. వీరిలో 13 మందికి యాంజియోగ్రామ్ అవసరమని గుర్తించారన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. దుర్గా రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ అన్నపరెడ్డి శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


వైఎస్సార్ బీమా అందజేత



కోనేరుసెంటర్: అరిశేపల్లి పంచాయతీ గంటలపాలెం గ్రామానికి చెందిన తమ్మన త్రిమూర్తులు ఇటీవల మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద మంజూరైన రూ. 10 వేలను గ్రామ ఇన్‌చార్జి చండిక అజయ్ గురువారం మృతిని భార్య ముల్లమ్మకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. సుకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకిరణ్, వలంటీర్లు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌కు చెందిన మెట్లదార మల్లయ్య ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సాయంగా మంజూరైన రూ. 10వేలను కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు గురువారం మృతుడి కుటుంబానికి అందజేశారు.

ఆర్థిక సాయం



మెరకనపల్లి(మోపిదేవి): మండల పరిధి మెరకనపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన పామర్తి ప్రసాద్ కుటుంబానికి కోనేరు కృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10 వేలను అందజేశారు. గురువారం ప్రసాద్ కుటుంబ సభ్యులను ట్రస్ట్ నిర్వాహకులు పరామర్శించి మృతుని తల్లి ఝాన్సీకి సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన శీలం ఆదిశేషు కుమారుడు శివకృష్ణ బైక్ ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్నాడు. వీరి కుటుంబాన్ని కూడా పరామర్శించి శివకృష్ణకు రూ. 5 వేల సాయాన్ని అందించారు. ట్రస్ట్ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెన్షనర్ల వితరణ

మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు పోలన మధు ఇటీవల మృతిచెందాడు. డివిజన్‌లోని తోటి పెన్షన్‌దారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 42,450లను మధు కుటుంబ సభ్యులకు కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బెజవాడ సత్యవతి, గృహ సారథులు యర్రా నాగరాజు, బళ్ల బాలసుబ్రహ్మణ్యం, మెట్ల శివ పాల్గొన్నారు.

ఓ పక్క ముంపు.. మరో పక్క ఎండుతున్న నారు



నడుపూరు పంట పొలాల్లో నిలిచి ఉన్న నీరు



కమలాపురంలో నీరు లేక ఎండుతున్న వరి పంట

- పెడన మండలంలో విచిత్ర పరిస్థితి
- నారుకు పెరిగిన డిమాండ్
- రూ. వెయ్యి నుంచి రూ. 2వేలు పలుకుతున్న వైనం
- దూర ప్రాంతాల నుంచి నారు తెచ్చుకుంటున్న రైతులు

పెడన: పెడన మండలంలో రైతులు విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక పక్క నీరు అధికంగా ఉండటంతో వెద సాగు వేసిన పంట పూర్తిగా దెబ్బతింది. మరో పక్క నీరందక నారుమళ్లు ఎండిపోతున్నాయి. మండల పరిధిలోని నడుపూరు, నడుపూరు అగ్రహారం, నేరికేపల్లి తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో వర్షం నీరు నిలిచే ఉంది. వర్షం నీరు బయటకు పోతున్నా.. మరో నాలుగు రోజులు గడిస్తేకానీ పూర్తిగా బయటపడే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. కొత్తగా నారు వేసుకుందామంటే పంట ఆలస్యమవుతుందని, నారు కొందామంటే సెంటు నారు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు పలుకుతోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరో పక్క కమలాపురం, చెన్నూరు, పెనుమల్లి, నందిగామ, కొంకేపూడి, బలిపర్రు, జింజేరు తదితర ప్రాంతాల్లోని పంటలకు ప్రస్తుతం సాగునీరందని దుస్థితి నెలకొందని, కాలువలు వదలాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు

అధిక వర్షాలతో వెదసాగు ద్వారా దెబ్బతిన్న రైతులు నారుమళ్లు వేసుకునేందుకు తక్కువ సమయంలో పంటలు పండే విత్తనాలు 5,204 సాంబమసూరి, ఎంటీయూ 1121 రకాలు వేసుకోవాలి. కొన్ని చోట్ల నీరు ఇంకా ఉన్న మాట వాస్తవమే. కొన్ని చోట్ల సాగునీరందాల్సి ఉంది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. రైతులు ముదురు ఆకు లభిస్తే నాట్లు వేసుకోవాలి. లేదంటే నీరు పూర్తిగా తగ్గిన తరువాత నారుమళ్లు వేసుకోవాలి. విత్తనాలు కావాల్సిన వారు ముందుగా ఆర్‌బీకేల ద్వారా బుక్ చేసుకోవాలి. ముందుగా ఎవరైతే బుక్ చేసుకుంటారో వారికి మాత్రమే విత్తనాలను అందిస్తారు.

– జీవీ శ్రీనివాసరావు, ఏఓ, పెడన

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు వేస్తున్న సర్పంచ్ లింగం సులోచనారాణి



పెదకళ్లేపల్లిలో విద్యార్థినికి మాత్రలు వేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

గూడూరు: చిన్నారులలో నులిపురుగుల నివారణ లక్ష్యంగా ఆల్‌బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గూడూరు సర్పంచి లింగం సులోచనారాణి అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల కడుపులో నులిపురుగులు ఉంటే శారీరక, మానసిక లోపాలను కలిగి ఉంటారన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు ఎదర్కొంటారని చెప్పారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. దీనిలో భాగంగా 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులకు విద్యా శాఖ, వైద్యారోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి బీఎస్‌ఆర్ శేఖర్‌సింగ్, హెచ్‌ఎం డి.పుష్పలత, సీహెచ్‌ఓ వేదశ్రీ, ఏఎన్‌ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఆల్‌బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు.

విద్యార్థులకు మాత్రల పంపిణీ..

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పలు అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణా మాత్రలు గురువారం పంపిణీ చేశారు. పెదకళ్లేపల్లి ఆరోగ్య కేంద్రంలోని 15 అంగన్‌వాడీ కేంద్రాలు, 17 ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు 1,074 మందికి గాను 969 మందికి మాత్రలను మధ్యాహ్న భోజనం అనంతరం మింగించామని పీహెచ్‌సీ డాక్టర్ హారిక తెలిపారు. డాక్టర్ శ్రీరామ్‌సాయి, హెచ్‌ఈ రాధా, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నులిపురుగుల నివారణ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. కోడూరు మెయిన్ ప్రాథమికోన్నత పాఠశాలలో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, విశ్వనాథపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారిలు విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను అందించారు. మానవ శరీరంలోకి వివిధ రకాలుగా నులిపురుగులు ప్రవేశిస్తాయని, దీంతో ఇన్ఫెక్షన్ సోకి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యాధికారి మౌనిక తెలిపారు. వీటి నివారణకు తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలన్నారు. మూడు రోజుల పాటు అన్ని పాఠశాలల్లో ఈ మాత్రల పంపిణీ చేస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెడన: మండలంలోని పాఠశాలు, కళాశాలలు, అంగన్‌వాడీలలో చిన్నారులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శర్మిష్ట పట్టణంలో కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. డాక్టర్ సీలిమా దేవి, ఎంపీ హెచ్‌ఓ శ్రీనివాస్, పెడన పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందాలి



మంగళాపురంలో స్మారక స్థూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సింహాద్రి



గండ్రం గ్రామంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచి సుబ్రహ్మణ్యేశ్వరరావు



విశ్వనాథపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మంగళాపురం(చల్లపల్లి): విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద నా భూమి–నా దేశం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళాపురం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమర యోధుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. దేశ స్వాతంత్య్రం కోసం త్యాగాలు, పోరాటాలు చేసిన మహనీయుల జీవిత విశేషాలు ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, ఆర్‌ఐ కిరణ్, పంచాయతీ ఈఓ బీవీ సుబ్బారావు, వైఎస్‌ఆర్ క్రాంతి పథం, ఉపాధి పథకం, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురిటిగడ్డలో..

పురిటిగడ్డ గ్రామ సచివాలయంలో నా భూమి–నా దేశం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ మాతంగి రమ్య పురిటిగడ్డ స్వాతంత్య్ర సమర యోధుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. జాతీయ జెండా ఎగురవేసి మొక్కలు నాటారు. గ్రామ ప్రత్యేక అధికారి జి.సాయి సింధు, పంచాయతీ ఈఓ పిట్టి రాంబాబు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించాలి

గూడూరు: అమరవీరులను స్మరించుకుంటూ వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకోవాలని గండ్రం సర్పంచి గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో గండ్రం గ్రామంలో నా భూమి–నాదేశం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం సమర్పిస్తూ గ్రామంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సర్పంచి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆవిష్కరించారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ప్రమిదలతో నివాళులర్పించారు. అనంతరం పంచప్రాణ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వై.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే ఆకుమర్రు, కలపటం, గురిజేపల్లి, ఐదుగుళ్లపల్లి, జక్కంచర్ల, కంచాకోడూరు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో నా భూమి నా దేశం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు

పంచాయతీల్లో 'నా భూమి–నా దేశం'

కోడూరు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని మూడు పంచాయతీల్లో అధికారులు 'నా భూమి–నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. పోటుమీద, పిట్టల్లంక, విశ్వనాథపల్లి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం నేల తల్లికి నమస్కరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్లు, స్వాతంత్య్రం కోసం పోరాడిన సమరయోధులకు నివాళులర్పించారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. మాతృభూమి పరిరక్షణ, పుడమితల్లిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. తొలుత కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెడన: మండల పరిధి గురువిందగుంట గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో నా భూమి–నా దేశం శిలాఫలకాన్ని ఎంపీపీ రాజులపాటి వాణి ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎంపీడీఓ వి. రెడ్డయ్య మాజీ ఎంపీపీ అచ్యుతరావు, సర్పంచ్ పుప్పాల స్వరూపరాణి పాల్గొన్నారు. కమలాపురంలో జరిగిన నా భూమి నాదేశం కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి జీవీ శ్రీనివాసరావు, సర్పంచ్ గుడిసేవ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యాదవ్‌రెడ్డి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు చోడవరం, చేవేంద్ర, కూడూరు గ్రామాల్లో ఆయా పాఠశాలల ఆవరణలో నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించి స్థానిక ప్రజాప్రతినిధులు శిలాఫలకాలను ఆవిష్కరించారు.

కోనేరుసెంటర్: మండల పరిధి పెదపట్నం గ్రామంలో గురువారం నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గడిదేశి అనూష పాల్గొని మొక్కలు నాటారు. అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. జాతీయజెండాను ఎగురవేశారు. వెలుగు ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రావు, సీసీ పాండురంగారావు, పంచాయతీ కార్యదర్శి జానకి, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి

కోనేరుసెంటర్: విద్యార్థులు స్నేహ భావంతో మెలగాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వైకే సుందరకృష్ణ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. సుందరకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చెప్పారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వీరబ్రహ్మచారి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆర్. కిరణ్ కుమార్, రసాయనశాస్త్ర విభాగాధిపతి డి. రామశేఖరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

దాలిపర్రులో పొలంబడి

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం దాలిపర్రులో గురువారం ఏఓ కె. మురళీకృష్ణ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిమొక్క పిలకదశలో ఉన్నప్పుడు 5 సెం.మీ మేర నీటిని నిల్వ ఉంచడం వల్ల పిలకలు బాగా వృద్ధి చెందుతాయని చెప్పారు. కలుపు యాజమాన్య పద్ధతిలో భాగంగా నాటు వేసిన మూడు నుంచి ఐదు రోజుల వ్యవధిలో ఆక్సీ ఫ్లైఆర్గిల్ మందును 200 మి.లీ నీటిలో 40–50 గ్రాముల మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. నాటు వేసిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో బిస్పైరిబ్యాక్ సోడియం మందును ఎకరాకు 100 నుంచి 120 మి.లీ పిచికారీ చేయాలని సూచించారు. వెడల్పు ఆకు కలుపుజాతి మొక్కల నివారణకు నాటు వేసిన 30 రోజుల తరువాత డి సోడియం సాల్ట్‌ను ఎకరాకు 400 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలని వివరించారు. వీఏఏ సత్యదేవ్, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గణపేశ్వరం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

నాగాయలంక: అధిక శ్రావణ మాసం సందర్భంగా స్థానిక శ్రీదుర్గా–గణపేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం దుర్గాదేవి అమ్మవారికి రవిక (జాకెట్) పూజా మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) గురువారం తెలిపారు. ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణశాస్త్రి, కనకదుర్గమ్మ భక్త సమాజం నేతృత్వంలో భక్తులు తీసుకొచ్చిన జాకెట్ ముక్కలకు ప్రత్యేక పూజలు జరిపి తిరిగి వారికే సమర్పిస్తారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

మంగళాపురం(చల్లపల్లి): అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు గొరిపర్తి శ్రీనివాసు (హెచ్‌జీ317) తన స్వగ్రామం మంగళాపురంలో గురువారం ఉదయం గుండెపోటుతో ఇంటి వద్దనే మృతి చెందాడు. రాత్రి నైట్ డ్యూటీ చేసి వచ్చిన శ్రీనివాసు ఉదయం ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే విశ్రమిస్తూ పడిపోయాడు. ఆ సమయంలో అతని భార్య పొలం పనులకు వెళ్లడంతో ఇరుగు పొరుగు ఇళ్లల్లోని బంధువులు గమనించి చల్లపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసు గతంలో చల్లపల్లి పోలీస్ స్టేషనులో పని చేశాడు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం. నాగమల్లేశ్వరరావు నుంచి రూ.25కి జాతీయ జెండాను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీని పురస్కరించుకుని పోస్టల్ శాఖ ద్వారా విక్రయిస్తున్న జాతీయ జెండాలను కొనుగోలు చేసి ప్రతి ఇంటిపై ఎగుర వేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వ్యవసాయ మిషన్ జిల్లా సభ్యుడు సామర్ల రామచంద్రరావు, ఏపీపీ నరహరిశెట్టి ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ నూరుశాతం పూర్తి చేయండి

బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల ఈకేవైసీ నూరుశాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. శ్రీనివాసరావు అన్నారు. ఆయన కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల ఈకేవైసీ సరిగా లేకపోవడంతో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) చెల్లింపుల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. ఇందుకోసం ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారులందరికీ బ్యాంక్ ఖాతాలకు ఈకేవైసీ నూరుశాతం పూర్తి చేసేలా ఆయా బ్యాంకు అధికారులతో మాట్లాడాలని చెప్పారు. ఈకేవైసీ, ఎంపీసీఏ యాక్టివేషన్ చేయించడం ద్వారా డీబీటీ చెల్లింపుల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా లబ్ధిదారుని వ్యక్తిగత ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. ఇందుకోసం సచివాలయ సిబ్బంది ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారులు ఈకేవైసీ పూర్తి చేసుకునేలా ప్రణాళిక రూపొందించుకుని నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు.

సర్పంచి పదవికి నామినేషన్లు



ఎన్నికల అధికారికి నామినేషన్ అందజేస్తున్న లోయ ఊహ

గూడూరు: కోకనారాయణపాలెం సర్పంచి పదవికి ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి ఆర్‌ఎస్ రేవతి తెలిపారు. పంచాయతీలలో ఖాళీగా ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల ఉప ఎన్నికలల్లో భాగంగా గురువారం సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల ఘట్టం ముగిసింది. గూడూరు మండలం కోకనారాయణపాలెం సర్పంచి పదవికి బండి అంజలి కుమారి, బండి లీలా ప్రతాప్ బుధవారమే నామినేషన్లు దాఖలు చేయగా, చివరి రోజైన గురువారం బండి అంజలి కుమారి మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. వీరితో పాటుగా చోడగం భిక్షాలరావు, పుప్పాల సురేష్, దాసరి ఉమాసాయిరామ్‌లు కూడా తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

మొదటి రెండు రోజులు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాని పోలవరం 11వ వార్డుకు చివరి రోజు ఏకంగా నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. పిచ్చుక విజయనాగ వెంకట లక్ష్మి, పిచ్చుక శ్యామల, వీరంకి నాగమణి, రేపల్లె వెంకటేశ్వరమ్మలు గురువారం తమ నామినేషన్‌లు దాఖలు చేశారు. జక్కంచర్లలో 1వ వార్డుకు సంబంధించి మొదటి రోజు వెన్న వెంకట భారతి నామినేషన్ దాఖలు చేయగా గురువారం మరో అభ్యర్థి ఆత్మూరి రజని నామినేషన్ దాఖలు చేశారు. ఆకులమన్నాడు రెండో వార్డుకు సంబంధించి మిర్యాల వెంకటేశ్వరరావు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

కొంగంచర్ల సర్పంచ్ పదవికి మరో మూడు నామినేషన్లు..

పెడన: మండల పరిధి కొంగంచర్ల సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి మరో మూడు నామినేషన్లు గురువారం దాఖలయ్యాయి. ఎన్నికల అధికారి చల్లపల్లి ఈఓపీఆర్డీ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం లోయ ఊహ, పుట్టి శ్యామల, పుట్టి నాగజ్యోతి నామినేషన్లు వేశారని ఆయన తెలిపారు. ఇప్పటివరకు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు ఆయన వివరించారు. కాకర్లమూడి నాలుగో వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి గుడిసె లక్ష్మీ తిరుపతమ్మ, గుడిసె రత్నకుమారి నామినేషన్ వేసినట్లు అధికారులు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పేర్ని కిట్టు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 26వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

పేర్ని కిట్టు ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిన పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి మాడపాటి వెంకటేశ్వరరావు, పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన

లక్ష్మీపురం(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. గురువారం లక్ష్మీపురం గ్రామ సచివాలయం–2 పరిధిలోని రామానగరం బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌బాబు గ్రామంలోని 334 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన సాధిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గత పాలకుల కంటే ఎంతో మెరుగైన ర్యాంకు సాధించిందంటే అది కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే సాధ్యమైందన్నారు. ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.